బండి రమేష్‌కు శుభాకాంక్షలు



బండి రమేష్‌ను సన్మానించి శుభాకాంక్షలు చెబుతున్న కాంగ్రెస్ కార్యకర్తలు

అల్లాపూర్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): అల్లాపూర్ డివిజన్‌కు చెందిన పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు పార్టీ కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండి రమేష్‌ను మంగళవారం కలిశారు. రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడిగా బండి రమేష్ నియమితులైన సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మస్తాన్ రెడ్డి, విఠల్ రెడ్డి, నర్సింహ యాదవ్, సతీష్ రెడ్డి, గౌస్, అనిల్ కుమార్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



కార్పొరేటర్‌తో తులసి నగర్ సంక్షేమ సంఘం సభ్యులు

అల్లాపూర్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): అల్లాపూర్ డివిజన్ పరిధిలోని తులసి నగర్‌లో ఇటీవలి జరిగిన ఎన్నికల్లో అంకిత్ సింగ్ ఠాకూర్ విజేతగా నిలిచిన విషయం విధితమే. ఈ సందర్భంగా అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సబీహ బేగంను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను తమ సమస్యలుగా భావించి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో అల్లాపూర్ డివిజన్ బీఆర్ఎస్ కో-ఆర్డినేటర్ వీరారెడ్డి, పాండు యాదవ్, విజయ్ కుమార్, జ్ఞానేశ్వర్, బ్రహ్మం మల్లికార్జున్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాలకృష్ణ జన్మదిన వేడుకలు



బాలకృష్ణ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న బలుసు సుధీర్ చౌదరి తదితరులు

హైదర్‌నగర్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): సినీహీరో, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలు బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి ఎదురుగా కూకట్‌పల్లి బాలాజీనగర్‌కు చెందిన జ్యోతిర్మయ క్యాటరింగ్ అధినేత బలుసు సుధీర్ చౌదరి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 1000 మందికి పైగా అన్నదానం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ యువనేత పృథ్వీచౌదరి, టీడీపీ తెలుగు యువత నాయకుడు ఆర్‌కే చౌదరి, కొసరాజు రాము, గణేష్, నాని తదితరులు పాల్గొన్నారు.

ప్రాణం పోతేనే స్పందిస్తారా?

- కాలనీల్లో ప్రమాదకరంగా మారిన మ్యాన్‌హోల్స్
- వర్షాకాలంలో ప్రాణాపాయం ఉంటుందని స్థానికుల ఆందోళన
- పట్టించుకోని, ప్రజాప్రతినిధులు, అధికారులు



బాలానగర్ నుంచి ఐడీపీఎల్ వెళ్లే రోడ్డు బస్టాప్‌లో..



ఆల్విన్‌కాలనీ ఫేజ్-2లో ప్రమాదకరంగా ఉన్న మ్యాన్‌హోల్

హైదర్‌నగర్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): మూతలు లేని, శిథిలావస్థకు చేరిన మ్యాన్‌హోల్స్‌తో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని పలుకాలనీలు, బస్తీల్లో మ్యాన్‌హోల్స్ ప్రమాదభరితంగా మారాయి. రాత్రి సమయంలో ద్విచక్రవాహనదారులు, పాదచారులు మూతలు లేని మ్యాన్‌హోల్స్‌లో పడి గాయాలపాలవుతున్నారు. వర్షం కురిసినప్పుడు ఎక్కడ మ్యాన్‌హోల్ ఉందో తెలియని పరిస్థితి నెలకొంటుంది. మ్యాన్‌హోల్స్ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని స్థానికులు వాపోతున్నారు. చిన్నారుల తల్లిదండ్రులు, వృద్ధులు ఆందోళన చెందుతున్నారు.



లక్ష్మీనగర్ కూకట్‌పల్లి రోడ్డులో..



పటేల్‌నగర్ నల్లచెరువు రోడ్డులో..

ప్రజల్లో ఆందోళన

నిత్యం ఈ ప్రాంతాల నుంచి రాకపోకలు జరుగుతున్న క్రమంలో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. కూకట్‌పల్లి ఆల్విన్‌కాలనీ, ఫేజ్-1,2, పంచమి కాలనీ, ఎల్లమ్మబండ, ఆస్‌బెస్టాస్ కాలనీ, రిక్షాపుల్లర్స్‌కాలనీ, భాగ్యనగర్ కాలనీ, జయానగర్, హైదర్‌నగర్ ప్రాంతాల్లో మ్యాన్‌హోల్స్ నోర్లు తెరుచుకున్నాయి. ఈ ప్రాంతాల్లో భారీ నిర్మాణాలు జరుగుతుంటంతో తరుచూ భారీ లారీలు రాకపోకలు సాగిస్తుండటంతో మ్యాన్‌హోల్స్ ధ్వంసమవుతున్నాయి. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి మ్యాన్‌హోళ్లకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మరమ్మతులు చేయాలి



మ్యాన్‌హోల్స్ ధ్వంసం కావడం, మూతలు లేకపోవడంతో భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. రాత్రి సమయంలో ద్విచక్రవాహనదారులు కిందపడి గాయాలపాలవుతున్నారు. వర్షం వచ్చినప్పుడు మ్యాన్‌హోల్స్ కనిపించక అందులో పడి మరణించే అవకాశం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలి.

- సతీష్, మాధవరం కాలనీ

స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ తప్పనిసరి



స్కూల్ బస్సులను తనిఖీ చేస్తున్న మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనుబాబు

హైదర్‌నగర్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): పాఠశాలల బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తప్పనిసరని, అన్ని నిబంధనలు పాటించాలని కూకట్‌పల్లి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనుబాబు తెలిపారు. మంగళవారం కూకట్‌పల్లి పరిధిలోని పలు పాఠశాలలకు చెందిన బస్సులను ఆయన తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని బస్సులను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 12 నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో ఆయా పాఠశాలల యజమానులు బస్సులకు ఫిట్‌నెస్‌తో పాటు సంబంధిత పత్రాలు కలిగి ఉండాలని ఆదేశించారు. లేనిపక్షంలో బస్సులను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

ఇళ్ల కేటాయింపులపై స్పష్టత ఇవ్వాలి

- అధికారులను కోరిన ఎమ్మెల్యే మాధవరం
- ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని ఆవేదన



బాలానగర్ వార్డు కార్యాలయంలో అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే కృష్ణారావు

కూకట్‌పల్లి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి నియోజకవర్గంలోని నిరుపేదలు ఇందిరమ్మ ఇళ్లకోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని, ఇళ్ల కేటాయింపులపై అధికారులు ప్రజలకు స్పష్టత ఇవ్వాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. మంగళవారం బాలానగర్ డివిజన్‌లో కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డితో కలిసి అన్ని శాఖల అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ముందుగా దిల్‌కుష్‌నగర్ కాలనీ సమస్యలపై కాలనీవాసులతో మాట్లాడారు. ప్రధానంగా విద్యుత్ హైటెన్షన్ వైర్లు, డ్రైనేజీ పైప్‌లైన్ మార్చాలని కాలనీవాసులు కోరడంతో ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడారు. సమస్యను వివరించి వెంటనే పరిష్కరించాలని సూచించారు. అనంతరం బాలానగర్ వార్డు కార్యాలయంలో పలు శాఖల అధికారులతో సమావేశమయ్యారు. అక్కడకి వచ్చిన ప్రజలు కాలనీలో ఉన్న సమస్యలపై వినతిపత్రాలు అందించారు. రాజు కాలనీలో విద్యుత్, డ్రైనేజీ, వీధి దీపాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు కాలనీవాసులు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో బాలానగర్‌లో వేలాది కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు పూర్తిచేశామన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక నిధులు మంజూరైనా పనులు ముందుకు సాగడం లేదని విమర్శించారు. ప్రజల సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడం బాధాకరం

దేశంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ కాళేశ్వరం నిర్మించిన కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడం బాధాకరమని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బాలానగర్ డివిజన్‌లో పర్యటించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టుతో రాష్ట్రంలో ఇంటింటికి నీళ్లు అందిస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తుందని, ప్రజలు త్వరలోనే ప్రభుత్వానికి గుణపాఠం చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆస్‌బెస్టాస్ కాలనీలో కార్పొరేటర్ బస్తీబాట



ఆస్‌బెస్టాస్ కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్

కూకట్‌పల్లి, జూన్ 10(ఆంధ్ర జ్యోతి): కూకట్‌పల్లి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ మంగళవారం డివిజన్ పరిధిలోని ఆస్‌బెస్టాస్ కాలనీలో బస్తీబాట నిర్వహించారు. కాలనీవాసులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. దోమల బెడదతో ఇబ్బందులు పడుతున్నామని, ఫాగింగ్ చేయించాలని ప్రజలు కోరారు. అలాగే కాలనీలో ఉన్న ఓపెన్‌నాలాలు ప్రమాదకరంగా ఉన్నాయని, నాలాల చుట్టూ ప్రహరీ నిర్మించాలని కోరారు. ఆస్‌బెస్టాస్ కాలనీ థీమ్‌పార్క్ వద్ద పచ్చదనం పెంచాలని మరికొందరు విన్నవించారు. స్పందించిన కార్పొరేటర్ అధికారులతో మాట్లాడారు. వీలైనంత త్వరగా సమస్యలు పరిష్కరించాలని సూచించారు.

యోగా దినోత్సవ సన్నాహక సమావేశం



సమావేశంలో పాల్గొన్న కాంతారావు తదితరులు

హైదర్‌నగర్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లిలో నిర్వహించనున్న యోగా దినోత్సవానికి సంబంధించిన సన్నాహక సమావేశం కూకట్‌పల్లి స్వచ్ఛభారత్ అభియాన్ అధ్యక్షుడు మాధవరం కాంతారావు ఆధ్వర్యంలో వివేకానందనగర్‌లోని ఆయన నివాసంలో నిర్వహించారు. యోగా దినోత్సవం నిర్వహణపై చర్చించారు. కార్యక్రమంలో యోగా గురువు శివుడు, అభియాన్ కమిటీ సభ్యులు శేఖర్‌రావు, పవన్, వినోద్, కుమార్‌గౌడ్, గోపి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



డివిజన్ పరిధిలో పర్యటిస్తున్న కార్పొరేటర్, అధికారులు

శేరిలింగంపల్లిని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా

● కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్

గచ్చిబౌలి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లిని ఆదర్శవంతంగా తీర్చి దిద్దుతామని కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ అన్నారు. మంగళవారం ఆయన అధికారులతో కలిసి డివిజన్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలు తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా పారిశుధ్యం అస్తవ్యస్తంగా ఉందని, వర్షాకాలంలో ఇలాగే ఉంటే అంటు వ్యాధులు వస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. స్పందించిన కార్పొరేటర్ రాగం సమస్యను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. దోమల విజృంభన ఎక్కువగా ఉందని, ఫాగింగ్ చేయడం లేదని స్థానికులు ఫిర్యాదు చేయగా అక్కడే ఉన్న ఎంటమాలజీ సిబ్బందికి చెప్పారు. రోజు విడిచి రోజు ఫాగింగ్ జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షాకాలంలో ప్రతి ఒక్కరు తమ పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని, అప్పుడే అంటువ్యాధులు, దోమలు ఉండవన్నారు.



ఎంఐజీకాలనీ వద్ద గేటు మూసివేయడంతో పక్కనుంచి వెళ్తున్న కాలనీవాసులు

గేట్ల మూసివేతతో విద్యార్థులకు ఇబ్బందులు

భెల్‌కాలనీ, జూన్ 10(ఆంధ్రజ్యోతి): బీహెచ్‌ఈఎల్ యాజమాన్యం తీసుకుంటున్న భద్రత చర్యల్లో భాగంగా కాలనీలోకి ప్రవేశించే రహదారులను నెలరోజుల క్రితం మూసివేశారు. అశోక్‌నగర్‌కు వెళ్లే రహదారిలో శ్రీనివాస్ థియేటర్ వద్ద ఉన్న గేటు, లింగంపల్లి నుంచి టౌన్‌షిప్‌లోకి ప్రవేశించే ప్రధాన చెక్‌పోస్ట్, మ్యాక్‌సొసైటీ కాలనీ, ఎంఐజీ బ్యాంక్‌రోడ్డును పూర్తిగా మూసివేశారు. దీంతో కాలనీలోకి ప్రవేశించేందుకు ప్రత్యామ్నాయ మార్గాల నుంచి వెళ్తున్నారు.

వేలాది మంది విద్యార్థులకు తిప్పలే..

రేపటి నుంచి పాఠశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లో ఏడు పాఠశాలలు ఉండగా.. 8 వేల మందికిపైగా విద్యార్థులు వాటిల్లో చదువుతున్నారు. వారిలో ఐదు వేల మందికి పైగా విద్యార్థులు ఎంఐజీకాలనీ, విద్యుత్‌నగర్, నల్లగండ్ల, తెల్లాపూర్, అశోక్‌నగర్, కొల్లూర్ తదితర ప్రాంతాల నుంచి టౌన్‌షిప్‌లోని పాఠశాలలకు వస్తుంటారు. ప్రధానంగా ఎస్‌బీఐ బ్యాంక్ రోడ్డు విద్యార్థులకు అందుబాటులో ఉండేది. ఆంక్షల పేరిట యాజమాన్యం ఆ గేటును పూర్తిగా మూసివేయడంతో విద్యార్థులు ఇబ్బందులు పడనున్నారు. అర కిలోమీటర్ దూరంలో పాఠశాల ఉంటే రెండు కిలోమీటర్లు చుట్టూ తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని పాఠశాలలకు వెళ్లేందుకు, తిరిగి ఇళ్లకు వచ్చే సమయాల్లో గేట్లను తెరిచి ఉంచాలని ప్రజలు కోరుతున్నారు.

రంగు వెలిసిన రంగ్‌లాల్ కుంట

● మురికి నీటి కుంటగా మారుతున్న చెరువు
● అభివృద్ధి పనులను ప్రైవేట్ సంస్థకు అప్పగించిన టీజీఐఐసీ
● మధ్యలోనే ఆగిపోయిన సుందరీకరణ పనులు
● అధికారులు దృష్టి సారించాలని కోరుతున్న ప్రజలు



చెరువులో చేరిన మురుగు నీరు.. మధ్యలోనే నిలిచిపోయిన వాకింగ్ ట్రాక్ పనులు

రాయదుర్గం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ఎటు చూసినా ఆకాశాన్ని తాకుతున్నాయా అనిపించే అందమైన భవనాలు, విశాలమైన రహదారులు కలిగిన అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చెందింది నానక్‌రామ్‌గూడ ఐటీ జోన్. అయితే ఇక్కడున్న రంగ్‌లాల్ కుంట అధికారుల నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా నిలిచింది. నానక్‌రామ్‌గూడ ఐటీ కారిడార్ నుంచి ఓఆర్‌ఆర్ వైపు వెళ్లే రోడ్డులో ఉన్న రంగ్‌లాల్ కుంట పైనుంచి టీజీఐఐసీ వంతెన నిర్మించింది. ఆ సమయంలో చెరువును పూడ్చి వేస్తున్నారని గ్రామస్థులు అభ్యంతరం వ్యక్తం చేశారు. సహజ వనరులను అభివృద్ధి పేరుతో నాశనం చేయవద్దని స్థానికులు నినదించారు. దీంతో వారిని శాంతపరిచేందుకు రంగ్‌లాల్ కుంటను సుందరంగా తీర్చిదిద్దుతామని అధికారులు హామీ ఇచ్చారు.

ప్రైవేట్ సంస్థకు అభివృద్ధి పనులు

వంతెన నిర్మాణంతో రంగ్‌లాల్ కుంట రెండు భాగాలుగా విడిపోయినట్లు కనిపిస్తుంది. వంతెన పనులు పూర్తయ్యాక చెరువును అభివృద్ధి చేసే బాధ్యతలను అధికారులు ఓ ప్రైవేట్ సంస్థకు అప్పగించారు. ఆ సంస్థ చెరువులోని ఓ భాగాన్ని సుందరీకరించేందుకు పనులను ప్రారంభించింది. పనుల్లో భాగంగా వాకింగ్ ట్రాక్ కోసం మట్టిని నింపారు. అనంతరం పనులను మధ్యలోనే నిలిపివేశారు. మరో భాగంలో కొందరు చెరువులో మట్టిని నింపి కబ్జా చేసే ప్రయత్నం చేస్తున్నారు. కబ్జాదారుల బారి నుంచి చెరువును కాపాడాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంతో కుంట అభివృద్ధి కుంటుపడింది.

అధికారుల నిర్లక్ష్యం కారణంగా చుట్టుపక్కల నుంచి మురుగు నీరు వచ్చి చేరడంతో రంగ్‌లాల్ కుంట ప్రస్తుతం మురుగు నీటికి నిలయంగా మారింది. జాతీయ, అంతర్జాతీయ ఐటీ కంపెనీలతో ప్రపంచ ఖ్యాతి గడించిన నానక్‌రామ్‌గూడ ఐటీ జోన్ ప్రాంతానికి నిత్యం ప్రముఖులు వస్తుంటారు. ఇలాంటి ప్రాంతంలో ఉన్న కుంటను ఇలా వదిలేయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా చెరువును సుందరీకరించి సందర్శకులను ఆకట్టుకునేలా తీర్చిదిద్దాలని ప్రజలు కోరుతున్నారు.

సుందరీకరిస్తే ఐటీ జోన్‌కు మరింత కళ

ప్రతిరోజూ దేశ, విదేశాల నుంచి పలు కంపెనీల ప్రతినిధులు, వీఐపీలు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటారు. ఇలాంటి రహదారిలో ఉన్న రంగ్‌లాల్ కుంటను సుందరీకరిస్తే ఐటీ జోన్‌కు మరింత కళ సంతరించుకుంటుంది.

- మల్లేష్, నానక్‌రామ్‌గూడ

త్వరలోనే పనులు పూర్తి చేస్తాం

రంగ్‌లాల్ కుంట సుందరీకరణ పనులను త్వరలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఎలక్ట్రిసిటీ కనెక్షన్ ఇవ్వాల్సి ఉంది. అది పూర్తయితే త్వరలోనే మిగతా పనులను పూర్తి చేస్తాం. సాధ్యమైనంత త్వరలో పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తాం.

- కవిత, జోనల్ కమిషనర్, టీజీఐఐసీ నానక్‌రామ్‌గూడ



ఎమ్మెల్యే గాంధీకి వినతిపత్రం ఇస్తున్న కాలనీ వాసులు

సమస్యలు పరిష్కరించాలి

హైదర్‌నగర్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): వివేకానందనగర్ కమలా ప్రసన్ననగర్ కాలనీవాసులు మంగళవారం పీఏసీ ఛైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీని కలిశారు. కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. అసంపూర్తిగా ఉన్న యూజీడీ, సీసీరోడ్ల పనులు పూర్తిచేయాలని ఎమ్మెల్యేను కోరారు. స్పందించిన ఎమ్మెల్యే త్వరలోనే కాలనీలో పర్యటించి అన్ని సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంజీవ రెడ్డి, కమలా ప్రసన్ననగర్ అధ్యక్షుడు చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు తిరుపతి, జాయింట్ సెక్రటరీ బండప్ప, రాఘవులు, ఆర్గనైజర్ వెంకటేష్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి వాకాటికి శుభాకాంక్షలు



మంత్రి శ్రీహరిని సన్మానిస్తున్న అనిల్‌కుమార్

గచ్చిబౌలి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): మంత్రివర్గంలో చోటు దక్కించుకున్న మక్తల్ ఎమ్మెల్యే వాకాటి శ్రీహరిని శేరిలింగంపల్లికి చెందిన కాంగ్రెస్ నాయకుడు అనిల్‌కుమార్ యాదవ్ కలిశారు. ఆయన్ను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మాజీ ఉపరాష్ట్రపతితో సమావేశం



సాహితీవేత్త, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ వెంకట్ గరికపాటి మంగళవారం మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడుని మంగళవారం కలిసి తన వ్యాఖ్యాన గ్రంథాలు అందజేశారు.

- (హైదరాబాద్ సిటీ, ఆంధ్రజ్యోతి)

దారిదోపిడీకి పాల్పడిన నలుగురి అరెస్ట్

మియాపూర్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): దారిదోపిడీకి పాల్పడిన నలుగురు నిందితులను మంగళవారం పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద ఉన్న సెల్ ఫోన్, రూ.17వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హఫీజ్‌పేట్ ప్రేమ్‌నగర్ బీ బ్లాక్‌కు చెందిన కాశీం అలీ ఈ నెల 7న బైక్‌పై ఇంటికి వెళ్తుండగా, అదే కాలనీకి చెందిన సయ్యద్ షబీర్, అఫ్రోజ్ అలీఖాన్, సయ్యద్ అర్పన్, మహ్మద్ హసన్‌లు మద్యం తాగి కాశీంను అడ్డుకున్నారు. అతని అకౌంట్‌లో ఉన్న రూ.13వేలు ఆన్‌లైన్‌లో ట్రాన్స్‌ఫర్ చేసుకున్నారు. జేబులో ఉన్న మరో రూ.4 వేలు తీసుకున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను అరెస్ట్ చేశారు.

జగదీశ్వర్‌గౌడ్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు

మియాపూర్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ జనరల్ సెక్రటరీగా (ప్రధాన కార్యదర్శిగా) నియమితులైన జగదీశ్వర్‌గౌడ్‌ను కలిసి పలువురు నాయకులు మంగళవారం శుభాకాంక్షలు తెలిపారు. ఆయన్ను కలిసిన వారిలో సాంబశివరావు, కృష్ణ పటేల్, రాంచందర్‌యాదవ్, శివ, రవిగౌడ్, శంకర్‌గౌడ్, శ్రీకాంత్, సాయి, కృష్ణ, సరస్వతి, మాధవిరెడ్డి, రాంబాబు, నవీన్, అశోక్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

అయ్యప్పస్వామి ఆలయంలో గోశాల ప్రారంభం



గోశాలను ప్రారంభిస్తున్న రాజేశ్వరరావు

హైదర్‌నగర్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): వివేకానందనగర్‌లోని అయ్యప్పస్వామి ఆలయంలో నూతనంగా నిర్మించిన గోశాలను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గోవు మన సంప్రదాయానికి, ఆధ్యాత్మికతకు, వ్యవసాయానికి ప్రాణాధారమన్నారు. గోశాలలు సమాజానికి వరంగా నిలుస్తాయన్నారు.

యాదవ హక్కుల పోరాట సమితి సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలిగా సరితాయాదవ్

భెల్‌కాలనీ, జూన్ 10(ఆంధ్రజ్యోతి): తెలంగాణ యాదవ హక్కుల పోరాట సమితి సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలిగా బీహెచ్‌ఈఎల్ ఎంఐజీకాలనీకి చెందిన సరితాయాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు సమితి రాష్ట్ర అధ్యక్షుడు మేకరి రాములు యాదవ్ చేతులమీదుగా నియామకపత్రం అందుకున్నారు. విద్య, ఉద్యోగావకాశాల్లో యాదవులకు కేటాయించిన రిజర్వేషన్ అమలయ్యేలా కృషి చేయాలని ఆమెకు రాములు యాదవ్ సూచించారు.



సఖి హోమ్ నుంచి ఇద్దరు బాలికల అదృశ్యం

గాజులరామారం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : సూరారం సఖి సెంటర్ నుంచి ఇద్దరు బాలికలు అదృశ్యమయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సూరారం శివాలయం కాలనీకి చెందిన ఓ బాలిక తల్లిదండ్రులతో ఉండటం ఇష్టం లేక ఇటీవల ఇంటి నుంచి పారిపోయింది. కొన్ని రోజుల తర్వాత జీడిమెట్ల పోలీసులకు బాలిక ఆచూకీ లభించడంతో తల్లిదండ్రుల వద్దకు చేర్చేందుకు ప్రయత్నించగా ఆమె వారితో ఉండేందుకు ఇష్టపడ లేదు. దీంతో పోలీసులు ఆమెను ఓ ప్రైవేటు సెంటర్లో ఉంచారు..ఆ సెంటర్లో మేడ్చల్ జిల్లాకు చెందిన మరో బాలికతో పరిచయం ఏర్పడింది. వారం క్రితం మేడ్చల్ జిల్లాకు చెందిన శిశు సంక్షేమ సభ్యులు ఆ బాలికకు కౌన్సిలింగ్ ఇచ్చి తల్లిదండ్రుల వద్దకు పంపించారు. ఈనెల 7న ఆ బాలిక మళ్లీ ఇంటి నుంచి పారిపోయి చింతల్ ప్రాంతానికి చేరుకుంది. తల్లిదండ్రుల వద్దకు వెళ్లడానికి ఇష్టపడకపోవడంతో ఆ బాలికను సూరారంలోని సఖి సెంటర్‌లో ఉంచారు. ఆ బాలిక ఈనెల 9 (సోమవారం) సెంటర్‌లోని కిటికీ గ్రిల్స్ ను తొలగించి మొదట పరిచయమైన బాలికతో కలిసి పారిపోయింది. బాలికలు పారిపోయేందుకు ఆ సెంటర్‌లో ఉండే మరో బాలిక సాయం చేసినట్టు అనుమానిస్తున్నారు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


కాంగ్రెస్ పార్టీలో చేరిన వారితో కొలన్ హన్మంత్‌రెడ్డి

కాంగ్రెస్‌లో తమిళ్ బస్తీవాసుల చేరిక

దుండిగల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలకు ప్రజలు ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరుతున్నారని ఆ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి అన్నారు. గాజులరామారం డివిజన్ తమిళ్ బస్తీకి చెందిన పలువురు బాచుపల్లిలోని కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డి.శ్యామ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా హన్మంత్‌రెడ్డి మాట్లాడుతూ, పేదల అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెడుతోందన్నారు. అర్హులైన పేదలు వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాశి మణి, రాజేందర్, కృష్ణ, శాంతి, సెల్వి, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

చెత్త సమస్య పరిష్కారం


గాంధీనగర్ రహదారి పక్కన చెత్తను తొలగించడంతో ఇలా..

పేట్‌బషీరాబాద్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్, రంగారెడ్డినగర్‌ల్లో చెత్తాచెదారం పేరుకుపోయి ఉండటంపై 'చెత్త శుద్ధి ఇదేనా?' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో మంగళవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. సామాజిక బాధ్యతను విస్మరించి కొందరు ఇష్టానుసారంగా రంగారెడ్డినగర్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో రహదారిపై వేసిన చెత్తను శానిటేషన్ సిబ్బంది తొలగించారు. చెత్త సమస్య పరిష్కారానికి కృషి చేసిన ఆంధ్రజ్యోతికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వాల్వ్‌కు మరమ్మతులు

పేట్‌బషీరాబాద్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : 'లీకేజీ ... తాగు నీరు వృథా' అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో మంగళవారం ప్రచురితమైన కథనానికి జలమండలి మేనేజర్ పూజిత స్పందించారు. రంగారెడ్డినగర్ డివిజన్‌లోని మెకిన్ పరిశ్రమకు వెళ్లే 300 ఎంఎం డయా పైప్‌లైన్ వాల్వ్ నుంచి నిత్యం తాగు నీరు వృథా అవుతోంది. నీరు వృథా అవుతున్న ప్రాంతాన్ని సందర్శించి సిబ్బందితో వాల్వ్‌కు మరమ్మతులు చేయించి లీకేజీని అరికట్టారు.



గుంతల రోడ్డుతో అవస్థలు

- కంకర తేలి ప్రమాదకంగా రోడ్డు
- పట్టించుకోని అధికారులు


దుండిగల్ మున్సిపల్ ఆఫీసు నుంచి బహదూర్‌పల్లి చౌరస్తాకు వెళ్లే రోడ్డు దుస్థితి ఇదీ..

దుండిగల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): దుండిగల్ మున్సిపాలిటీ పరిధి గండిమైసమ్మ మండల ప్రభుత్వ కార్యాలయాల పక్కనే ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు, క్రీడా స్టేడియం మధ్యలో నుంచి బహదూర్‌పల్లి చౌరస్తాకు వెళ్లే రోడ్డు గుంతలుగా మారింది. ఈ రోడ్డు మీదుగా నిత్యం ఆ ప్రాంతం నుంచి రాకపోకలు సాగించే ప్రజలు నరక యాతన పడుతున్నారు. ముఖ్యం గా ఈ రోడ్డు క్రీడా స్టేడియం గేటు మొదలుకొని సత్యం కంప్యూటర్ ప్రహరీ వరకు గుంతలు మరింత ప్రమాదకరంగా ఉన్నాయి.

- రోడ్డుకు ఇరువైపులా భారీ చెట్లు ఉండటం, ఈ రోడ్డులో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు తప్ప మరే కాలనీలు లేక పోవడంతో ఈ రహదారి బాగోగులను పట్టించుకునే అధికారులు కరువయ్యారు. అధికారులు ఎప్పుడైనా ఈ రోడ్డు నుంచి రాకపోకలు సాగించి ఉంటే పేద ప్రజలు బాధలు తెలిసి ఉండేవని స్థానికులు అంటున్నారు. అధికారులు ఎప్పుడూ ఈ మార్గంలో వెళ్లడం లేదని, కేవలం సిబ్బంది రాకపోకలు సాగిస్తున్నారని, వారు కూడా ఈ రోడ్డు దుస్థితిని అధికారుల దృష్టికి తీసుకెళ్లడం లేదని స్థానికులు వాపోతున్నారు.
- ఇటు బహదూర్‌పల్లి నుంచి పాఘూర్‌నగర్ వెళ్లేవారు కూడా తమకు ఎందుకులే అన్నట్టు వదిలేస్తున్నారు. కొద్దిపాటి వర్షం వచ్చినా మోకాలు లోతు నీరు ఆ గుంతల్లో చేరుతోంది. దీంతో భారీ వాహనాలు, ద్విచక్ర వాహనదారులు నానా అవస్థలు పడాల్సి వస్తోంది. మున్సిపల్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి ఈ గుంతల రోడ్డుకు మరమ్మతులు చేయించడంతో పాటు ఆ గుంతల పక్కన చెట్ల పొదల్లో వేస్తున్న గృహ నిర్మాణ వ్యర్థాలను కూడా తొలగించాలని అధికారులను స్థానికులు కోరుతున్నారు.

అధ్వానంగా వార్డు ఆఫీసు రోడ్డు


గుంతలమయంగా ఉన్న రోడ్డు

గాజులరామారం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): గాజులరామారం డివిజన్‌లోని మహాదేవపురం వార్డు కార్యాలయానికి వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. ఎక్కడ చూసినా అడుగు లోతు గుంతలు ఉండటం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. నిత్యం ఈ రోడ్డు గుండా వార్డు కార్యాలయానికి వచ్చి వెళ్లే ఉన్నతాధికారులకు కూడా ఈ రోడ్డును బాగు చేయించాలనే ఆలోచన రాకపోవడం దురదృష్టకరమని స్థానికులు అంటున్నారు. వెంటనే అధికారులు వార్డు ఆఫీసు రోడ్డుకు మరమ్మతులు చేయించాలని వారు కోరుతున్నారు.

బీజేపీ జీడిమెట్ల డివిజన్ కార్యవర్గం ఎన్నిక

పేట్‌బషీరాబాద్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : పార్టీ కోసం అందరం కలిసికట్టుగా పని చేయాల్సిందేనని జీడిమెట్ల డివిజన్ కార్పొరేటర్ చెరుకుపల్లి తారాచంద్రారెడ్డి అన్నారు. డివిజన్‌లోని కుత్బుల్లాపూర్ కార్యాలయంలో జీడిమెట్ల డివిజన్ బీజేపీ నూతన కార్యవర్గాన్ని డివిజన్ అధ్యక్షుడు రాజు ఆధ్వర్యంలో ఎంపిక చేశారు. ఉపాధ్యక్షుడిగా బి.అంజయ్య, బి. కృష్ణవేణి, ఎం.పాపయ్య దొర, ఎన్. సతీష్ గౌడ్, ప్రధాన కార్యదర్శులుగా టి.మహేష్, సతీష్ చక్రవర్తి, కార్యదర్శులుగా ప్రసాద్ శర్మ, పి.నవీన్‌రెడ్డి, బి.శ్రీలత, కె. మురళి, కోశాధికారిగా దీపక్ గౌడ్‌లను నియమించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, నూతన కార్యవర్గం డివిజన్‌లోని సమస్యలను తన దృష్టికి తీసుకు రావడంతో పాటు ప్రధాని మోదీ ప్రవేశ పెట్టిన పథకాలు, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకు వెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. నూతన డివిజన్ కమిటీని బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్‌సింహా రెడ్డి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ డివిజన్ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

'పారిశుధ్య నిర్వహణను నిర్లక్ష్యం చేస్తే చర్యలు'

జీడిమెట్ల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య నిర్వహణపై నిర్లక్ష్యం చేసే సిబ్బంది, అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని కుత్బుల్లాపూర్ సర్కిల్ ఉప కమిషనర్ వి.నర్సింహ హెచ్చరించారు. సుభాష్‌నగర్‌లో పారిశుధ్య నిర్వహణను పరిశీలించి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న జవాన్, ఎస్ఎఫ్ పారిశ్యు నిర్వాహణ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక నాయకులు చారి, గుబ్బల లక్ష్మణ్, బాస్కర్‌రెడ్డిలు స్థానికంగా ఉన్న సమస్యలను ఉపకమిషనర్‌కు వివరించారు. నాలాపై కప్పు లేకపోవడతో తీవ్రమైన దుర్వాసన వస్తోందని, నాలాపై కప్పు నిర్మించాలని కోరారు. తప్పకుండా పరిశీలిస్తామని డీసీ వారికి హామీ ఇచ్చారు.

అక్రమ నిర్మాణాన్ని పరిశీలించిన హైడ్రా అధికారులు

జీడిమెట్ల, జూన్10 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ సర్కిల్ చింతల్ ప్రధాన రహదారిలో నిర్మించిన అక్రమ నిర్మాణాన్ని మంగళవారం ఉదయం హైడ్రా అధికారులు పరిశీలించారు. జీహెచ్ఎంసీ అధికారులు గతంలోనే ఈ భవనాన్ని సీజ్ చేశారు. అయితే, అధికారుల ఆదేశాలను తుంగలో తొక్కుతూ సీజ్‌ను తొలగించి ఆ భవన నిర్మాణాన్ని పూర్తిచేశారు. రెండు రోజుల క్రితం ఈ భవనంలో ఓ ప్రైవేట్ ఆసుపత్రిని కూడా ప్రారంభించారు. ఉప కమిషనర్ నర్సింహ ఇప్పటికే భవన నిర్మాణదారులపై జీడిమెట్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసులు నమోదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు ఇప్పటి వరకు ఈ విషయంపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలుస్తోంది. కాగా, హైడ్రా అధికారులు మంగళవారం ఈ భవనాన్ని పరిశీలించి వెళ్లారు తప్పా.. ఎలాంటి చర్యలు తీసుకోలేదు. త్వరలోనే చర్యలు తీసుకుంటారని తెలుస్తోంది.